సాక్షి
అనంతపురం

శుక్రవారం । 30 । మే । 2025



టన్ను చీనీ రూ.34 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34 వేలు పక్రారం ధర పలికింది.



రేపు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ క్యాంప్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 31వ తేదీన జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు.

గరిష్టం/కనిష్టం
34.7°/23.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగినా.. ఉక్కపోత తగ్గలేదు. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సజావుగా బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: మెప్మా, గ్రంథాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సజావుగా జరిగింది. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మెప్మా, గ్రంథాలయ శాఖ ఉద్యోగుల కౌన్సెలింగ్ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ వేర్వేరుగా నిర్వహించారు. మెప్మాలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించి లైబ్రేరియన్ గ్రేడ్-3, రికార్డ్ అసిస్టెంట్, కార్యాలయ సహాయకుల బదిలీలకు కౌన్సెలింగ్ చేపట్టారు. కార్యక్రమంలో మెప్మా పీడీ జె.విశ్వజ్యోతి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి తహసీల్దార్, వీఆర్వోకు నోటీసులు

పామిడి: మండలంలోని అప్పాజీపేట గ్రామంలో సర్వే నంబర్ 178-బీలోని 10 ఎకరాల భూమి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన తహసీల్దార్ ఎస్. శ్రీధర్‌మూర్తి, వీఆర్వో జ్యోతికి ఉన్నతాధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఆ పొలానికి సంబంధించి గత నెల మార్చి7న గ్రీవెన్స్‌లో అర్జీ వచ్చింది. దీనిపై బుధవారం కలెక్టర్ వినోద్ కుమార్ అర్జీదారునికి ఫోన్ చేశారు. భూమి విషయంపై సంబంధిత వీఆర్వో, తహసీల్దార్ తోనూ ఆయన ఫోన్‌లో మాట్లాడారు. సదరు 10 ఎకరాలు ప్రభుత్వ భూమి అని, దీన్ని ఇరువురు ఆక్రమించుకొని అనుభవిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూమి అని తెలిసినా స్వాధీనం చేసుకోవడంలో అలసత్వం ప్రదర్శించిన రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తికి కాషన్ నోటీసు, వీఆర్వో జ్యోతికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీజీఆర్ఎస్ తహసీల్దార్‌ను ఆదేశించారు. భూమి ఆక్రమణదారులపై 22 రోజుల్లో చర్యలు చేపట్టాలని సూచించారు.

'రెవెన్యూ'లో బదిలీలకు 313 దరఖాస్తులు

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో బదిలీ కోసం 313 మంది అధికారులు, సిబ్బంది దరఖాస్తు చేసుకున్నారు. 16 మంది తహసీల్దార్లు, 44 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 12 మంది రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, 38 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు, 10 మంది జూనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ ఐదుగురు, గ్రేడ్-1 వీఆర్‌ఓలు 68 మంది, గ్రేడ్-2 వీఆర్‌ఓలు 113 మంది, అటెండర్‌లు ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు.

'సూపర్'లో మూడు రోజులు ఓపీ సేవలు

అనంతపురం మెడికల్: రోగులకు స్పెషాలిటీ వైద్యాన్ని విస్తృతం చేయడంలో భాగంగా జూన్ 2 నుంచి వారంలో మూడు రోజుల పాటు ఓపీ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమ, గురు, శనివారాల్లో గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరో సర్జరీ, సీటీపీ, ప్రతి మంగళ, బుధ, శనివారాల్లో కార్డియాలజీ, న్యూరాలజీ, యురాలజీ, ప్రతి సోమ, బుధ, శనివారాల్లో నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ, పీడియాట్రిక్ సర్జరీ విభాగాల ఓపీ ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్లు



అనంతపురం అగ్రికల్చర్: విత్తన వేరుశనగ కోసం శుక్రవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. ఈ ఏడాది జిల్లాకు కేవలం 50,592 క్వింటాళ్లు కేటాయించారు. 40 శాతం రాయితీ ప్రకటించారు. కే-6 రకం 46,692 క్వింటాళ్లు, కదిరి-లేపాక్షి (కే-1812) రకం 900, టీసీజీఎస్-1694 రకం 3 వేల క్వింటాళ్లు మండలాలకు అలాట్ చేశారు. కే-6, టీసీజీఎస్-1694 రకం క్వింటా పూర్తి ధర రూ.9,300 కాగా రాయితీ రూ.3720 పోనూ రైతుల వాటా రూ.5,580గా ఖరారు చేశారు. కే-1812 రకం ధర రూ.8,200 కాగా రాయితీ రూ.3,280 పోనూ రైతులు తమ వాటా కింద రూ.4,920 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రాథమిక వైద్యం పడకేసింది. కూటమి సర్కారు పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వైద్య రంగం తిరోగమనంలో వెళుతోంది. మందుల కొరత, డాక్టర్లు అందుబాటులో లేకపోవడం నిత్యకృత్యమయ్యాయి. ఇక పేదలకు అపర సంజీవనిగా వెలుగొందిన ఆరోగ్యశ్రీ పథకం నిర్వీర్యం కావడంతో ప్రజల కష్టాలు చెప్పనలవిగా మారాయి.

పడకేసిన వైద్యం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో తామున్న ప్రాంతంలోనే వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు (ఫైల్)

కూటమి.. కనికరం లేమి

- చంద్రబాబు ప్రభుత్వంలో ప్రాథమిక ఆరోగ్య రంగం కుదేలు
- 104, 108 వాహనాల సేవలకు తీవ్ర విఘాతం
- మందుల కొరతతో అల్లాడుతున్న సామాన్య రోగులు
- ఏడాది పాలనలో ఆరోగ్య రంగం తిరోగమనం

తేలు కుట్టినా మందులు వేయరు



నా పేరు బి.మంజు. బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి గ్రామం. గవర్నమెంటు ఆసుపత్రికి వెళితే సరైన వైద్యం అందడం లేదు. కనీసం తేలు కుట్టినా కూడా మందులు వేయరు. సరైన సదుపాయాలు లేకపోవడంతో గ్రామీణులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరం ఉన్నా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పది రోజుల క్రితం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత మందుల పంపిణీపై రాష్ట్రవ్యాప్తంగా కూటమి సర్కారు ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 50 శాతం మంది తమకు మందులు అందడం లేదని చెప్పారు. చాలాచోట్ల యాంటీబయాటిక్స్ లేవు. పాముకాటు మందు లేదు. గర్భిణులకు కాన్పు సమయంలో ఇచ్చే ఇంజెక్షన్లు లేవు. అంతెందుకూ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం ఆస్పత్రిలోనే మందులు లేవు. పీహెచ్‌సీ నుంచి బోధనాసుపత్రి వరకూ మందుల కొరత రోగులను వేధిస్తోంది.

దారుణ పరిస్థితులు..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రక్తపరీక్షలు సరిగా జరగడం లేదు. ఎమర్జెన్సీ మందులు లేవని సిబ్బంది వాపోతున్నారు. చిన్నారులకు ఇచ్చే టీకాలు కూడా సరిగా సరఫరా కావడం లేదని చెబుతున్నారు.

'ఆరోగ్య శ్రీ' నిర్వీర్యం..

2019-24 మధ్య కాలంలో అప్పటి సీఎం జగన్ చొరవతో ఆరోగ్యశ్రీ పథకం కొత్త జవసత్వాలు నింపుకుంది. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 3,250 జబ్బులకు ఈ పథకం ద్వారా చికిత్సలు అందించేవారు. అయితే, చంద్రబాబు అధ్యక్షతన కూటమి సర్కారు ఏర్పాటినప్పటి నుంచి పథకం ప్రకారం 'ఆరోగ్య శ్రీ'ని నిర్వీర్యం చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు రెండు మాసాలకోసారి సమ్మెకు దిగుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం త్వరలో 'ఆరోగ్య శ్రీ'ని ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పబోతున్నట్లు తెలుస్తోంది. దీంతో భవిష్యత్తులో పథకం పరిస్థితి ఎలా ఉంటుందోనని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

గాల్లో దీపంలా 108, 104 ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాది మందిని ఆపత్కాలంలో ఆదుకున్న 108 అంబులెన్సులు నేడు షెడ్డుకు చేరాయి. అంబులెన్సుల నిర్వహణా సంస్థను మార్చారు. పాత వాహనాలన్నీ రాప్తాడు వద్ద షెడ్డులో పడ్డాయి. కాల్ వెళ్లిన 30 నిమిషాల్లో ఘటనా స్థలికి వెళ్లాల్సిన అంబులెన్సు నేడు గంటకు కూడా రావడం లేదు. ఇక 104 అంబులెన్సులకు కూటమి సర్కారు రాగానే కాలం చెల్లింది. గతంలో నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి దీర్ఘకాలిక వ్యాధుల బాధితులు, గర్భిణులకు మందులివ్వడంతో పాటు వైద్య పరీక్షలు చేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. 104 వాహనాలు పల్లెలకు వెళ్లక ఏడాది అవుతోంది.

పెనుకొండలో మెడికల్ కాలేజీకి గ్రహణం...

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో వైఎస్ జగన్ హయాంలో రూ.375 కోట్లతో మెడికల్ కాలేజీకి పునాది వేశారు. కూటమి సర్కారు వచ్చాక దీన్ని ముందుకు కదలనివ్వలేదు. ఉమ్మడి జిల్లా అంతటికీ కలిపి ఇప్పటికీ 'అనంత'లో ఒక్కటే మెడికల్ కళాశాల ఉంది. కొత్త కాలేజీ వస్తే శ్రీ సత్యసాయి జిల్లాకు వరం అయ్యేది. కానీ 'కూటమి' దీన్ని కాలరాసింది.

ప్రభుత్వాసుపత్రుల్లో లేని మాత్రలివే..

మందు	ఏ జబ్బుకు
లాల్‌బటాలాల్ 2ఎంఎల్ ఇంజెక్షన్	రక్తపోటు/ హైపర్‌టెన్షన్
పెరిడాక్సిన్‌క్లోరైడ్ 10 ఎంఎల్ ఇంజెక్షన్	నరాల బలహీనత
క్లోటిమాజెల్	గర్భాశయ ఇన్ఫెక్షన్ల నియంత్రణకు
అమినోయాసిడ్ 500 ఎంఎల్ ఇంజెక్షన్	గాయాలు మానడం కోసం
ఫ్లూకనోజోల్ 200 ఎంజీ	అలర్జీ నియంత్రణకు
అమాక్సిలిన్ క్లావ్‌లిక్ యాసిడ్	యాంటీబయాటిక్
బెటమిథోజోన్- 2	స్టెరాయిడ్స్
నైట్రోగైసెరిన్-2	గుండె సంబంధిత వ్యాధులకు

గత వైఎస్సార్ సీపీ హయాంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వివరాలు ఇలా..

అనంతపురం జిల్లాలో	
విలేజ్ హెల్త్‌క్లినిక్స్‌లో నిర్వహించిన క్యాంపులు	425
ఔట్‌పేషెంట్ల నమోదు	1,69,368
వార్డు సచివాలయాల్లో క్యాంపులు	107
ఔట్‌పేషెంట్ల నమోదు	48,442
మొత్తం నిర్వహించిన క్యాంపులు	532
మొత్తం ఔట్‌పేషెంట్ల నమోదు	2,17,810
సగటున ఒక్కో క్యాంపులో ఔట్‌పేషెంట్లు	409
కంటి పరీక్షలు చేయించుకున్న పేదలు	27,018

జీతాలూ లేవ్

కూటమి ప్రభుత్వంలో వైద్య సిబ్బందికీ ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేస్తున్న 32 మంది డ్రైవర్లకు జీతాలు అందించకపోవడమే ఇందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో వీరికి నెలకు రూ.7,200 చొప్పున వేతనం చెల్లించేవారు. వీరి సేవలను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 8,800కు పెంచారు. అయితే, కూటమి ప్రభుత్వం మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో డ్రైవర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కరుణ చూపాలి

జీతాలు అందక కుటుంబ పోషణ భారంగా మారింది. పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. వచ్చే జీతం కూడా ఏమాత్రం సరిపోవడం లేదు. కూటమి ప్రభుత్వం మా జీతాలను రూ.28 వేలకు పెంచాలి. కష్టజీవులపై కరుణ చూపాలి.

-నగేష్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

పట్టణాలకు వెళ్లాల్సిందే..



గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మెగా వైద్య శిబిరాలు నిర్వహించేవారు. వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చిన్న జబ్బు చేసినా పట్టణాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

– ఐ.సుధీర్, కళ్యాణదుర్గం

చాలా ఇబ్బందిగా ఉంది



ఈ నెల 16న మా తల్లి ఆరోగ్యం విషమించడంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకు వచ్చాం. అక్యూట్ మెడికల్ కేర్‌లో మంచం లేదని రెండు రోజుల పాటు ఇక్కడే ఉంచారు. ప్రాణాపాయ కేసులకు ఎప్పటికప్పుడు వార్డుకు షిఫ్ట్ చేసి సేవలందిస్తే బాగుంటుంది. రోజుల పాటు ఎమర్జెన్సీ వార్డులోనే ఉంచితే ఎలా.. చాలి ఇబ్బందిగా ఉంది.

– తిక్కయ్య, చిగిచెర్ల గ్రామం, ధర్మవరం మండలం

అధికారుల తప్పిదం... విద్యార్థులకు శాపం

- అనంతపురం 'అబుల్ కలాం ఆజాద్' బీపీఎస్ స్కూల్‌కు అన్యాయం
- విద్యార్థుల లెక్క సరిగా లేకపోవడంతో రద్దయిన పీఎస్‌హెచ్‌ఎం పోస్టు
- డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధిత టీచర్లు



అబుల్ కలాం ఆజాద్ నగరపాలక ఉర్దూ స్కూల్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ అధికారులు చేసిన తప్పులకు నగరంలోని అబుల్ కలాం ఆజాద్ నగరపాలక ఉర్దూ హైస్కూల్, బీపీఎస్ (బేసిక్ ప్రైమరీ స్కూల్) విద్యార్థులు బలవుతున్నారు. 117 జీఓ ప్రకారం 3-5 తరగతులకు కూడా సబ్జెక్టు టీచర్ల బోధన అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఆ తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. 1,2 తరగతులను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చారు. అయితే,కూటమి ప్రభుత్వం 117 జీఓకు తోసిరాజని పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ చేపట్టింది. ఈ క్రమంలో 9 రకాల పాఠశాలలు పుట్టుకొచ్చాయి. ఇందులో హైస్కూల్+బీపీఎస్ ఒకటి. అబుల్‌కలాం ఆజాద్ నగరపాలక ఉర్దూ పాఠశాల ఈ కోవలోకి వచ్చింది. ఇక్కడ 1-5 తరగతులను బీపీఎస్‌గా, 6-10 తరగతులను హైస్కూల్‌గా విభజించారు.

1,2 తరగతుల విద్యార్థులు మాయం

3,4,5 తరగతుల విద్యార్థులు 20 మంది, 1,2 తరగతుల విద్యార్థులు 14 మంది ఉన్నారు. మొత్తం 34 మంది పిల్లలు ఈ బేసిక్ ప్రైమరీ పాఠశాలలో ఉన్నారు. 21 జీఓ ప్రకారం బీపీఎస్ స్కూళ్లలో 1-10 మంది విద్యార్థులకు రెండు ఎస్జీటీ పోస్టులు, 11-30 మంది విద్యార్థులుంటే 3 ఎస్జీటీ పోస్టులు, 31-59 ఉంటే మూడు ఎస్జీటీ పోస్టులతో పాటు పీఎస్‌హెచ్‌ఎం/ఎస్‌ఏ పోస్టు కేటాయిస్తారు. అయితే, విద్యాశాఖ అధికారులు ఈ స్కూల్లో 1,2 తరగతుల విద్యార్థులను చూపించలేదు. వారిని మ్యాపింగ్ చేయలేదు. 3-5 తరగతుల విద్యార్థులు 20 మంది ఉంటే 18 మందిని మాత్రమే చూపించారు. వాస్తవానికి ఈ స్కూల్‌కు మూడు ఎస్జీటీ పోస్టులతో పాటు ఒక పీఎస్‌హెచ్‌ఎం/ఎస్‌ఏ రావాల్సి ఉంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా చూపిస్తున్న కారణంగా పీఎస్‌హెచ్‌ఎం పోస్టు కోల్పోయారు.

10 రోజులుగా డీఈఓ కార్యాలయం చుట్టూ...


తమ పాఠశాలకు జరిగిన అన్యాయంపై హెచ్‌ఎం, కొందరు పది రోజుల నుంచి డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. డీఈఓను, టెక్నికల్ విభాగం సిబ్బందిని కలిసి రోజూ వినతిపత్రాలు ఇస్తున్నారు. వారు తీసుకోవడంతోనే సరిపెడుతున్నారు తప్ప సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. సాంకేతిక పరంగా పొరబాటు జరిగిందంటూ పరిష్కారం చూపించలేదని బాధిత టీచర్లు వాపోతున్నారు. వాస్తవానికి 9 మంది దాకా ఉర్దూ ఎస్ఏలు మిగులు టీచర్లుగా ఉన్నారు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆ స్కూల్‌కు ఒకరిని కేటాయిస్తే అటు టీచరుకు, ఇటు విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

పడిగాపులు.. చీకట్లో అగచాట్లు

- స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతుల కౌన్సెలింగ్
- ఉదయం నుంచి రాత్రిదాకా వేచిఉన్న టీచర్లు
- ఎట్టకేలకు రాత్రి 7 గంటలకు ప్రారంభమై 10 గంటలకు పూర్తి



కౌన్సెలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు



అనంతపురం శారదా మున్సిపల్ పాఠశాలలో రాత్రి 9 గంటల సమయంలో పడిగాపులు కాస్తున్న టీచర్లు, (ఇన్‌సెట్‌లో) సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో ముందుకు వెళ్తున్న ఉపాధ్యాయిని

అనంతపురం ఎడ్యుకేషన్: హెచ్‌ఎంలుగా పదోన్నతులు తీసుకునేందుకు టీచర్లు గురువారం పడిగాపులు కాశారు. ఉదయం 11 గంటలకే శారదా నగర పాలక ఉన్నత పాఠశాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశావాహులు చేరుకున్నారు. రాష్ట్ర అధికారుల నుంచి లింక్ రాలేదు.. జాబితా సిద్ధం చేస్తున్నాం తదితర కారణాలు చెబుతూ మధ్యాహ్నం 2 గంటలకు చేపడతామని స్వయంగా డీఈఓ ప్రకటించారు. ఈ క్రమంలో అందరూ భోజనం చేసుకుని 2 గంటలలోపే అక్కడికి చేరుకున్నా అప్పటికీ ప్రారంభం కాలేదు. సాయంత్రం 4 గంటలకు అంటూ మరోమారు ప్రకటించారు. తర్వాత 6 గంటలకు అని చెప్పినా అప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన టీచర్లు పడిగాపులు కాశారు. ఎట్టకేలకు రాత్రి 7 గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభించారు. రాత్రి 10 గంటలకు ముగిసింది. మొత్తం 148 హెచ్‌ఎం పోస్టులకు గాను ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన 3 పోస్టులకు ఆర్జేడీ కార్యాలయంలో పదోన్నతులు కల్పిస్తారు. తక్కిన జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల పాఠశాలలకు సంబంధించిన 145 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించారు. ఇదిలాఉండగా కౌన్సెలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. చీకటి పడిన తర్వాత వెలుతురు సరిగా లేక టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీటి వసతి కూడా కల్పించలేదు. ముఖ్యంగా మహిళా టీచర్లు అగచాట్లు పడ్డారు.

133 మంది హెచ్‌ఎంల బదిలీలు..

వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 133 మంది ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. మొత్తం 191 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 29 మంది తప్పనిసరి బదిలీ కాగా...162 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 104 మంది బదిలీ కాగా తక్కిన 58 మంది బదిలీ కాలేదు.

ఆలస్యమైన సీనియార్టీ జాబితా..

స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించిన తాత్కాలిక సీనియార్టీ జాబితా శుక్రవారం విడుదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వాస్తవానికి రెండు రోజుల కిందటే జాబితా సిద్ధం కావాల్సి ఉన్నా... హెచ్‌ఎం పదోన్నతుల కౌన్సెలింగ్ ఉన్న కారణగా ఆలస్యమవుతోందని ఉద్యోగులు చెబుతున్నారు.

ఎక్కువ పాయింట్ల నమోదుపై జాగ్రత్త..

ఉపాధ్యాయుల పాయింట్ల నమోదును ఎంఈఓలు జాగ్రత్తగా పరిశీలించాలని డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రావాల్సిన పాయింట్ల కంటే ఎక్కువ వచ్చి ఉంటే అలాంటి వారితో గ్రీవెన్స్ పెట్టించి తగ్గించుకునేలా చూడాలని ఆదేశించారు. తర్వాత ఎక్కువ పాయింట్లు వచ్చినట్లు ఫిర్యాదులు వస్తే మాత్రం క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ముఖానికి మాస్క్.. మెడలో టవల్

- సాధారణ వ్యక్తిలా గుంతకల్లు ఆస్పత్రికి కలెక్టర్ వినోద్‌కుమార్
- రాత్రి 10 గంటల సమయంలో వార్డుల్లో ఆకస్మిక తనిఖీ



ముఖానికి మాస్క్, మెడలో టవల్ వేసుకుని రాత్రి 10:30 గంటల సమయంలో ఆస్పత్రిలోకి వస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతకల్లుటౌన్: సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలు అంటూ నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ వినోద్‌కుమార్ ఓ సాధారణ వ్యక్తిలా ముఖానికి మాస్క్ ధరించి, మెడలో టవల్ వేసుకుని గుంతకల్లు ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బుధవారం రాత్రి గుంతకల్లులో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొన్న కలెక్టర్ వినోద్ కుమార్.. తిరిగి అనంతపురం వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిగ్గా రాత్రి 10.10 గంటల సమయంలో ముఖానికి మాస్క్, మెడలో టవల్ వేసుకుని ఆస్పత్రిలోకి ప్రవేశించిన ఆయన... తొలుత నూతన ఎంసీహెచ్ భవనం వద్దనున్న ప్రైవేట్ అంబులెన్స్ వద్దకు వెళ్లారు. తమ బంధువులను అనంతపురం తరలించాల్సి ఉందని, ఎంత ఖర్చవుతుందని ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌ను అడిగారు. ఆక్సిజన్‌తో అయితే రూ.5,500, ఆక్సిజన్ లేకుండా అయితే రూ.5 వేలు తీసుకుంటామని డ్రైవర్ చెప్పాడు. సరే మళ్లీ కలుస్తామని చెప్పిన కలెక్టర్.. అక్కడి నుంచి నేరుగా ఎమర్జెన్సీ క్యాజువాలిటీ, ఐడీ, లేబర్ వార్డులను పరిశీలించారు. రోగుల సహాయకులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది సేవలు, మందులు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం టాయిలెట్లను పరిశీలించారు. సుమారు 25 నిమిషాల పాటు ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు చేసినా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి తెలియలేదు. కలెక్టర్ బయటికి వెళ్తున్న సమయంలో బయటి నుంచి స్థానిక పోలీసుల రాకను గమనించిన ఆస్పత్రి సిబ్బంది ఎవరొచ్చారు.. ఎందుకొచ్చారని తెలుసుకుని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రోగుల వద్దకు వెళ్లి కలెక్టర్ ఏమడిగారు.. మీరేం సమాధానమిచ్చారంటూ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రాత్రి వేళ ఆకస్మికంగా తనిఖీ చేయడంతో ఒక్కసారిగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిలో అలజడి మొదలైంది.

సెక్యూరిటీ గార్డులకు మెమో ఇవ్వండి

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో ప్రైవేట్ అంబులెన్స్‌లను ఎందుకు పార్కింగ్ చేయిస్తున్నారని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావును ప్రశ్నించారు. గురువారం డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌రవి కుమార్‌తో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ అజేంద్రరావు, డ్యూటీ డాక్టర్ శ్రీనివాసయాదవ్‌ను కలెక్టరేట్‌కు పిలిపించుకున్నారు. ప్రభుత్వ అంబులెన్స్‌ను ఎందుకు నిరుపయోగంగా ఉంచారని ప్రశ్నించారు. ప్రైవేట్ అంబులెన్స్‌లను ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేయించడంపై కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డులకు మెమో జారీ చేయాలని, ఆస్పత్రి శానిటేషన్‌ను మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించినట్లు సూపరింటెండెంట్ వెల్లడించారు. ఆస్పత్రిలో జరుగుతున్న సాధారణ కాన్పులు, సిజేరియన్ల గురించి ఆరా కలెక్టర్ తీసినట్లు తెలుస్తోంది.

గురుకుల స్కూళ్లకు విద్యార్థుల ఎంపిక జాబితా విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి విద్యార్థుల జాబితా గురువారం విడుదలైంది. విద్యార్థుల పేర్లు, వారు పొందిన మార్కులు, ఎంపికైన స్కూల్ వివరాల జాబితా గుంటూరులోని ప్రధాన కార్యాలయం నుంచి విడులైనట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ కె. జయలక్ష్మీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 3లోపు ఆయా స్కూళ్లకు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత వచ్చే అడ్మిషన్లను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు. మెరిట్ జాబితాలోని తర్వాత విద్యార్థులకు ఆ సీటు కేటాయిస్తామన్నారు. ఒక గురుకులం నుంచి మరొక గురుకులానికి ఎట్టి పరిస్థితుల్లోనూ సీటు బదిలీ ఉండదన్నారు. ఎలాంటి సిఫార్సులకు అవకాశం ఉండదని కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా డాక్టర్ పీపీ రావు



గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల, శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్) డైరెక్టర్‌గా గురువారం డాక్టర్ పీపీ రావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేసిన డాక్టర్ బాలాజీ మురారి నాందేడ్‌ను మధ్యప్రదేశ్‌లోని బుద్ని సంస్థకు బదిలీ చేశారు. కాగా, డాక్టర్ పీపీ రావు 2016 నుంచి 2022 వరకు ట్రాక్టర్ నగర్ డైరెక్టర్‌గా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కాలపరిమితి పొడిగింపు

అనంతపురం అర్బన్: జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగించినట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ నిర్ణయం మేరకు అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని జూన్ ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు లేదా కొత్త కార్డులు జారీ చేసే వరకు (ఏది ముందు జరిగితే అప్పటి వరకు) పొడిగించినట్లు పేర్కొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

గుంతకల్లు రూరల్: గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. 2020 నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకూ గుంతకల్లు మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులను అభివృద్ధి పనులు చేపట్టకుండా అధికారులు, సర్పంచులు ఉమ్మడిగా కాజేశారంటూ ధర్మహ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ అధికారిగా డీఎల్‌పీఓ విజయ్‌కుమార్ నియమించడంతో ఆయన గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వీరాంజనేయులు సమక్షంలో వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులను విచారిస్తూ రికార్డులు పరిశీలించారు.

5న జాబ్ మేళా

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జూన్ 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లా రెడ్డి తెలిపారు. ఎంపికైన వారు ఐఆర్‌ఈపీ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లో అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, ప్రొద్దుటూరు, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, చిత్తూరు, హిందూపురం, కదిరి ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. సేల్స్ ఆఫీసర్, సీనియర్ సేల్స్, ఆఫీస్ అడ్మిన్, కలెక్షన్ ఎక్జిక్యూటివ్ ఉద్యోగాలకు డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసి 35 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులు. ఎన్‌బీఎఫ్‌సీ, ఎంస్‌ఈ, ఎంఎస్‌ఎంఈల్లో అనుభవం తప్పనిసరి. ఎంపికైన వారికి రూ.3.6 లక్షల వార్షిక వేతనం, రూ.2.4 లక్షల వార్షిక వేతనం అందిస్తారు.

జెడ్పీలో బదిలీలకు రంగం సిద్ధం

- సీఈఓ వెంకటసుబ్బయ్య పరిశీలనకు అర్హుల జాబితా
- నేడు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం ఫైల్

అందిన మొత్తం దరఖాస్తులు	236
ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారు	136 మంది
ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారి సంఖ్య	5
రిక్వెస్ట్ బదిలీల దరఖాస్తులు	100



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగుల బదిలీలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లా, మండల పరిషత్ సహా అనుబంధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జాబితా ఇప్పటికే పూర్తి స్థాయిలో రూపొందించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ తరువాత అవకాశాన్ని బట్టి రిక్వెస్ట్ బదిలీలకు చోటు కల్పించాలని సూచించింది.

బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులు 236

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ యాజమాన్యం పరిధిలో పని చేస్తున్న వారిలో 236 మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. వీరిలో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారు 136 మంది ఉండగా 131 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే రిక్వెస్ట్ బదిలీల కోసం ఏకంగా వంద మంది దరఖాస్తు చేసుకున్నారు. అటెండర్లలో 64 మంది ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకోగా బదిలీల కోసం 59 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

జాబితా సిద్ధం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిషత్ కార్యాలయాల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఎంత మందిని బదిలీ చేయవచ్చనే సమగ్ర వివరాలతో కూడిన ప్రత్యేక బృందం రూపొందించిన జాబిత పరిశీలన కోసం సీఈఓ వెంకటసుబ్బయ్య టేబుల్‌పైకి గురువారం చేరింది. ఆయన జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. కొందరు అటెండర్లు పదేళ్లుగా ఒకే చోట పాతుకుపోయారు. మరి కొందరు జిల్లా కేంద్రం దాటి బయటకు పోవడం లేదు. ఇక్కడిక్కడే జెడ్పీ లేదా పీఆర్ఐ, పీఐయూ, క్యూసీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇలా ఏదో ఒక ఆఫీసుకు బదిలీ చేయించుకోవడం పరిపాటిగా మారింది. జెడ్పీలో పని చేస్తూ ఏడాది కిందట ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారు తిరిగి జెడ్పీకి వచ్చేందుకు పావులు కదుపుతున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల ఇళ్లు, జెడ్పీ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

కేడర్ల వారీగా అందిన దరఖాస్తులు ఇలా..

కేడర్	ఐదేళ్ల సర్వీసు పూర్తి	రిక్వెస్ట్ బదిలీ
ఏఓ	--	13
ఎస్‌ఏ	7	16
జేఏ	2	29
రికార్డ్ అసిస్టెంట్లు	45	15
టైపిస్టులు	2	9
ల్యాబ్ అసిస్టెంట్లు	15	3
లైబ్రరీ అసిస్టెంట్లు	1	-
అటెండర్లు	59	15

ఇంకొందరు అనారోగ్యం సాకు చూపిస్తూ అందుకు అనుగుణంగా సర్టిఫికెట్లు సైతం సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు తుది ఆమోదం

ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైల్‌ను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వద్దకు శుక్రవారం పంపనున్నారు. ఆమె పరిశీలించి ఆమోదం తెలిపిన తరువాత బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. శని లేదా ఆదివారంలోపు కౌన్సెలింగ్ ప్రక్రియ ముగించే ఆలోచనలో జెడ్పీ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: ఎమర్జెన్సీ తలపించేలా పోలీసులను అడ్డు పెట్టుకుని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉరవకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులపై తప్పుడు కేసులు బనాయించి వారిని జైలుకు పంపించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అండ్ కో పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం అనంతపురంలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన ప్రగతి అంటూ ఏదీ లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. సంపద సృష్టి, సూపర్ సిక్స్ హామీలు కేవలం చంద్రబాబు అభూత కల్పనగానే మిగిలిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై అన్ని వర్గాల ప్రజల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. పాలన గాడి తప్పడంతో రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు అడుగంటి పోతున్నాయన్నారు. లిక్కర్ స్కాంలో అసలైన దోషి చంద్రబాబు అని బెయిల్‌పై బయటకు వచ్చి పాలన సాగిస్తున్నాడనే విషయాన్ని టీడీపీ పెద్దలు గుర్తించాలన్నారు. రైతుల శ్రేయస్సును పూర్తిగా విస్మరించిన క్రెడిట్ కూడా కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

‘ఆర్డీటీ’ పరిరక్షణకు పాదయాత్ర

- ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలంటూ 4న గొంచితండా నుంచి ప్రారంభం
- 62 గ్రామాలు....209 కిలోమీటర్ల మేర సాగనున్న పాదయాత్ర
- మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న రంగయ్య

కళ్యాణదుర్గం: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల ప్రజల అభ్యున్నతికి బాటలు వేసిన ఆర్డీటీ పరిరక్షణను అందరూ బాధ్యతగా స్వీకరించాలని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలనే డిమాండ్‌తో జూన్ 4వ తేదీ నుంచి జిల్లాలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై పార్టీ శ్రేణులతో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామితో కలసి గురువారం ఆయన సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దీటుగా పేదరిక నిర్మూలనకు ఆర్డీటీ కృషి చేస్తోందన్నారు. ఈ క్రమంలో ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్‌ను ప్రభుత్వాలు అడ్డుకున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో ఆర్డీటీ పరిరక్షణ ఆవశ్యకతపై ప్రజలను చైతన్యపరిచేందుకు సంస్థ సేవలను జిల్లాలో మొట్టమొదటి సారిగా ప్రారంభించిన బెళుగుప్ప మండలం గొంచితండా నుంచి జూన్ 4న పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, కళ్యాణదుర్గం మండలాల మీదుగా మొత్తం 62 గ్రామాలలో 209 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందన్నారు. ఉద్యమానికి కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, తదితరాలను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా పల్లెపల్లె నుంచి ఆర్డీటీ ద్వారా లబ్ధి పొందిన ప్రతి కుటుంబమూ ఓ ఉప్పెనలా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, ఎంపీపీ ఆంజనేయులు, మున్సిపాలిటీ కన్వీనర్ ఐ.సుధీర్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూర్యనారాయణ, ఎంఎస్ హనుమంతరాయుడు, కంబం చంద్రశేఖర్‌రెడ్డి, కె.హనుమంతరాయుడు, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, పార్టీ అనుబంధ విభాగాల కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, హనుమంతరెడ్డి, రామాంజినేయులు, నాయకులు గోపాలరెడ్డి, మంజునాథ్, తిప్పేస్వామి, ఫయాజ్, దాదు, కిరణ్, నరసింహులు, చరణ్, పాతలింగ, భాస్కర్, షెక్షావలి, మురళి, రాజు, పాండు, ఇబ్రహీం, అజయ్, ప్రతాప్, రామిరెడ్డి, మల్లికార్జున, తిమ్మారెడ్డి, కిరీటి యాదవ్, దేవ, మల్లి, సుధాకర్, నారాయణస్వామి, కేశవ్ గౌడ్, జానీ, జయరామిరెడ్డి, సుబ్బరాయుడు, గంగాధర్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి కొరడా

- బాధితుడికి రూ. 20 లక్షల పరిహారం

అనంతపురం: వైద్య సేవల్లో నిర్లక్ష్యం కారణంగా బాధితుడికి జరిగిన నష్టానికి రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వివరాలు... అనంతపురం నగరానికి చెందిన న్యాయవాది సుగుణాకర్ బాబు 2023 ఫిబ్రవరి 27న హైదరాబాద్‌లోని ప్రైడ్ హాస్పిటల్ డాక్టర్ చైతన్య కొమ్రేవార్ వద్ద మోకాలికి పీఆర్పీ చికిత్స చేయించుకున్నారు. అయితే చికిత్స అనంతరం మోకాలి కీళ్ల మరింత బాధించాయి. పుళ్లు ఏర్పడ్డాయి. దీంతో పలు దఫాలు ఆసుపత్రికి తిరగాల్సి వచ్చింది. ప్రాథమికంగా చిన్నపాటి ఆపరేషన్ చేస్తే సరిపోతుందని ముందు చెప్పిన డాక్టర్.. తర్వాత 30 సెం.మీ పొడవునా కాలు కోసి పెద్ద శస్త్ర చికిత్స చేశారు. ఆ తర్వాత కూడా తీవ్రమైన నొప్పులు రావడంతో సుగుణాకర్ బాబు 2023 ఏప్రిల్‌లో సెయింట్‌జాన్స్ హాస్పిటల్‌లో మళ్లీ శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. ఇందుకోసం రూ.2.5 లక్షలు ఖర్చయింది. ఈ క్రమంలో న్యాయవాద వృత్తిని కూడా ఆయన సక్రమంగా నిర్వర్తించలేకపోయాడు. ఇందుకు బాధ్యత వహించి డాక్టర్ వద్ద నుంచి నష్ట పరిహారం ఇప్పించాలంటూ బాధితుడు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. నోటీసులు అందుకున్న వైద్యుడు కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చుకున్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న కమిషన్.. వైద్య సేవలో నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణకు వచ్చింది. దీంతో బాధితునికి రూ.20 లక్షల పరిహారం, రూ.76,102 వైద్య ఖర్చులు, రూ.5 వేలు న్యాయ ఖర్చుల కింద చెల్లించాలంటూ డాక్టర్ చైతన్య కొమ్రేవార్‌ను జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత, సభ్యులు డి. గ్రేస్ మేరీ, బి. గోపీనాథ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. 45 రోజుల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించకపోతే 8 శాతం వార్షిక వడ్డీ కూడా చెల్లించాలని తీర్పు వెలువరించారు.

పదోన్నతులు కోరుతూ ధర్నా



ధర్నాలో పాల్గొన్న టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) పదోన్నతులు కల్పించాలంటూ బాధిత టీచర్లు గురువారం స్థానిక శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నా చేపట్టారు. ఆందోళనకు పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, వైఎస్సార్‌టీఏ, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ (1938), ఆప్టా, ఎన్టీఏ, ఎంఈఎఫ్, పీడీ అసోసియేషన్ తదితర సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆందోళన కారులు మాట్లాడుతూ.. గతంలో ఇంగ్లిష్ సబ్జెక్టుకు సంబంధించి 230 మందికి పదోన్నతులు ఇచ్చారని, కోర్టు వివాదం కారణంగా వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేశారని గుర్తు చేశారు. రూ.2,500 గౌరవ వేతనంతో మూన్నెళ్లకు పైగా పని చేశామన్నారు. ప్రస్తుతం ఆ పోస్టుల్లో కేవలం 19 మందిని మాత్రమే చూపిస్తున్నారన్నారు. ఇదెక్కడి అన్యాయం అంటూ వాపోయారు. విషయం తెలుసుకున్న డీఈఓ ప్రసాద్‌బాబు శిబిరం వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) పదోన్నతుల ఖాళీల విషయమై పాఠశాల విద్య డైరెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూర్యుడు, రమణారెడ్డి, రామాంజనేయులు, సిరాజుద్దీన్, రాయల్ వెంకటేష్, లింగమయ్య, శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ నాయక్, కరణం హరికృష్ణ, శ్రీధర్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జయరాం నాయక్, వెంకటరత్నం, శంకరమూర్తి, జైపాల్ నాయుడు, చంద్రశేఖర్, సుధాకర్, హరి ప్రసాద్ రెడ్డి, బండారు శంకర్, నరసింహారెడ్డి, రవి నాయక్, వాణిశ్రీ త్రివేణి విజయశ్రీ, లక్ష్మీదేవి, కౌసర్ భాను,సురేష్, కేశవరెడ్డి, నాగభూషణ, ఈరప్ప, నరసింహులు, శేషగిరి, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజకుళ్లాయప్ప (ఫైల్)

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన తోలు కృష్ణయ్య, సరస్వతి దంపతుల రాజకుళ్లాయప్ప (24) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కృష్ణయ్య, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, కొన్నేళ్ల క్రితమే కుటుంబ పెద్ద కృష్ణయ్య మృతి చెందాడు. అప్పటి నుంచి చిన్న కుమారుడు రాజకుళ్లాయప్ప వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతకూ రాజకుళ్లాయప్ప ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే విగతజీవిగా పడి ఉన్న కుమారుడ్ని చూసి తల్లి సరస్వతి బోరున విలపించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో మహిళ...



సావిత్రమ్మ (ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని అంకంపల్లి గ్రామానికి చెందిన పాటిల్ ప్రభాకర్‌రెడ్డి భార్య సావిత్రమ్మ(60) పాము కాటుకు గురై మృతి చెందింది. గ్రామానికి సమీపంలోనే ఉన్న తమ తోటలో గురువారం ఉదయం కూలీలతో పనులు చేయిస్తున్న భర్తకు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకెళ్లిన ఆమె అనంతరం కూలీలతో కలసి కలుపు తీత పనుల్లో నిమగ్నమైంది. ఆ సమయంలో రక్త పింజరి కాటు వేసింది. వెంటనే విషయాన్ని గుర్తించిన కూలీలు పామును కట్టెలతో కొట్టి చంపేశారు. సావిత్రమ్మను ఆగమేఘాలపై అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం కండి

- కలెక్టర్ వినోద్‌కుమార్



బుక్కరాయసముద్రం: ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం కావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బీకేఎస్ మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం వ్యవసాయ, ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ రైతుల కోసం విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో 100 శాతం క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. విత్తనశుద్ధి వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీసీడ్స్ డీఎం సుబ్బయ్య, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, తహసీల్దార్ పుణ్యవతి, సెరికల్చర్ అధికారి ఓబిలేసు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

రైతులు పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ‘జిల్లాస్థాయి వికసిత కృషి సంకల్ప అభియాన్’ ప్రారంభించారు. కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జూన్ మొదటి వారం వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న పాల్గొన్నారు.

మంటల్లో కాలి ఆలయ పూజారి మృతి

రాప్తాడు: మండలంలోని రామినేపల్లి గ్రామానికి చెందిన హరిజన నరసింహుడు (74) బుధవారం రాత్రి మంటల్లో కాలి మృతి చెందాడు. మృతుడి సోదరి హంప్లీ పెద్దక్క, పోలీసులు తెలిపిన మేరకు.. నరసింహుడుకు 30 ఏళ్ల క్రితం వివాహం కాగా, పెళ్లైన ఆరు నెలలకే భార్య నారాయణమ్మ అయనను వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మతి స్థిమితం లేక తిరిగేవాడు. రామినేపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో బంధువులు ఉన్నా కొన్నేళ్లుగా భిక్షాటనతోనే జీవనం సాగించాడు. అనంతరం 20 ఏళ్లుగా రామినేపల్లి-గొందిరెడ్డిపల్లి గ్రామాల మధ్యలో ఉన్న శివాలయంలో పూజలు చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. రోజూ ఆయనకు టిఫెన్, మధ్యాహ్న భోజనాన్ని అతని సోదరి హంప్లీ పెద్దక్క, యర్రగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీరెడ్డి సమకూర్చేవారు. గురువారం ఉదయం 7 గంటలకు పెద్దక్క కుమారుడు కేశవయ్య టిఫెన్ తీసుకుని వెళ్లిన సమయంలో అప్పటికే కాలిన గాయాలతో ఆలయం ఎదుట విగతజీవిగా పడి ఉన్న నరసింహుడు కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నరసింహుడు దుస్తులు నూనెలో అద్దినట్లుగా ఉండేవని, పైగా చూపు మందగించడంతో బుధవారం రాత్రి పక్కనే ఉంచుకున్న దీపం నుంచి మంటలు వ్యాపించి నరసింహుడిని చుట్టుముట్టి ఉంటాయనే భావించారు. మృతిపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం కావడం లేదంటూ పెద్దక్క చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డీసీసీబీ ఛైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా ముంటిమడుగు కేశవరెడ్డి నియమితులైనట్లు సీఈఓ కె.సురేఖా రాణి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేశవరెడ్డి నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్ అఫిసియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీఓ జారీ చేశారన్నారు.

మహానాడులో జీఆర్‌పీ హెచ్‌సీ హల్‌చల్



టీడీపీ నేత హోదాలో మహానాడులో పాల్గొన్న జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ వాసు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కడపలో జరుగుతున్న మహానాడులో గుత్తి జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ వాసు హల్‌చల్ చేశారు. రెండో రోజు (28వ తేదీ) కార్యక్రమాల్లో పాల్గొన్న వాసు.. టీడీపీ నేతలు ఇసురాళ్లపల్లికి చెందిన కిట్టుయాదవ్, లచ్చానుపల్లికి చెందిన రామాంజినేయులుతో దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి ఓ రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొనడం ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. కాగా, ఈ నెల 11న గుత్తి టీడీపీ సీనియర్ నేత కోనంకి కృష్ణపై పార్టీ కార్యాలయంలోనే వాసు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై కోనంకి కృష్ణ అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అప్పటి నుంచి వాసు ప్రత్యక్షంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ టీడీపీ నేతగా చెలామణి అవుతున్నాడు.

మహిళలపై కొడవలితో దాడి

గార్లదిన్నె: మండలంలోని కేశవాపురంలో ఇద్దరు మహిళలపై కొడవలితో దాడి చేయడంతో అత్త, కోడలుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కేశవాపురానికి చెందిన సుంకన్న కుమారుడు రాజేష్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే నెపంతో 2022, ఆగస్టు 21న కనుంపల్లి గ్రామ సమీపంలో పొలాల్లో హత్యకు గురయ్యాడు. రాజేష్‌ను అదే గ్రామానికి చెందిన వీరాంజనేయులు పొలాల్లోకి పిలుచుకెళ్లి హత్య చేసి, పెట్రోల్ పోసి నిప్పంటించినట్లుగా పోలీసులు గుర్తించారు. అప్పట్లో ఈ కేసుకు సంబంధించి వీరాంజనేయులు, సౌజన్య, మధు, ఆదినారాయణపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. రిమాండ్ అనంతరం వీరాంజనేయులు కుటుంబం గ్రామంలోకి రాకుండా గుత్తిలోనే నివాసముంటోంది. తర్వాత కక్షిదారులిద్దరూ రాజీ పడడంతో 2024లో ఈ కేసును న్యాయస్థానం కొట్టి వేసింది. ఈ నేపథ్యంలో సౌజన్య గురువారం తన అత్త శేషమ్మతో కలసి కేశవాపురంలోని ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న సుంకన్న కుటుంబసభ్యులు పాత కక్షలు మనసులో పెట్టుకుని దాడికి తెగబడ్డారు. శేషమ్మ, సౌజన్య ముఖాలపై కారం పొడి చల్లి కొడవలితో దాడి చేశారు. శేషమ్మ తలకు, సౌజన్య వీపు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అడ్డుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సుంకన్న, సురేష్, రవి, భార్గవి, కర్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి విత్తన రిజిస్ట్రేషన్

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు విత్తన వేరుశనగ కాయల కోసం శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుచరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభిస్తారన్నారు. విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, మొబైల్ ఫోన్ తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

'మద్దతు ధర పెంపు కంటితుడుపు చర్య'



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం అర్బన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఖరీఫ్, రబీ పంటలకు కేంద్రం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.69 పెంపు కంటితుడుపు చర్యని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు తరిమెల నాగరాజు విమర్శించారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పంట ఉత్పత్తి ఖర్చులను కేంద్ర ప్రభుత్వం తక్కువ చూపించి మద్దతు ధర ప్రకటించడం ద్వారా రైతులకు కనీసం పెట్టుబడి ఖర్చులు రావని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంటలకు వాస్తవ ఖర్చులు లెక్కగట్టి ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. వేరుశనగకు క్వింటాకు రూ.10 వేలు, ధాన్యం క్వింటాకు రూ.3 వేలు కనీస మద్దతు ధర ప్రకటించి అమలు చేయాలన్నారు. మిగిలిన అన్ని పంటలకూ మద్దతు ధరలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

2న వ్యాసరచన పోటీలు

అనంతపురం టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యావరణ శాఖ ఇంజినీర్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా సైన్స్ సెంటర్‌లో జూన్ 2వ తేదీ ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జూన్ 5న బహుమతులు, మెమొంటోలు అందజేస్తామన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు



యంత్రాలతో ఈద్గా మైదానాన్ని శుభ్రం చేయిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో పారిశుధ్య పనులు వేగవంతం చేశారు. మేయర్ వసీం ఆదేశాలతో గురువారం డ్రైవర్స్ కాలనీలోని ఈద్గా మైదానంలో రోలింగ్ మిషన్, బుల్‌డోజర్లతో గడ్డి తొలగింపు పనులు చేపట్టారు. సామూహిక ప్రార్థనలకు అన్ని వసతులు కల్పిస్తామని మేయర్ పేర్కొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి



స్థలాలను పరిశీలిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం కార్పొరేషన్: అహుడా బ్యాంక్ కోసం కోవూర్ నగర్‌లోని కో–ఆపరేటివ్ సొసైటీ స్థలం, కోర్టు రోడ్డు ఐటీఐ, గుత్తి రోడ్డు తడకలేరు బ్రిడ్జ్‌ను ఆనుకుని ఉన్న ఏడెకరాల స్థలాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ గురువారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అహుడా ప్రతిపాదించిన అధునాతన స్విమ్మింగ్ పూల్ కోసం రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌ను ఆనుకుని ఉన్న స్థలాన్ని పరిశీలించారు.

ముళ్లపొదల తొలగింపు



రహదారి పక్కన ఉన్న ముళ్లపొదలను జేసీబీతో తొలగిస్తున్న దృశం

సాక్షి ఎఫెక్ట్..

కనగానపల్లి: మండల కేంద్రం సమీపంలో కనగానపల్లి–మామిళ్లపల్లి రహదారి పక్కన మలుపు వద్ద ఉన్న ముళ్ల పొదలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. చెరువు కట్ట సమీపంలో మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ముళ్ల పొదలపై సాక్షి దినపత్రికలో 'మలుపు ప్రమాదాలకు పిలుపు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం మలుపు వద్ద ముళ్లపు పొదలను జేసీబీతో తొలగించారు. గుంతల్లో మట్టి వేసి చదును చేయించారు.

- ఫైనలిస్తేనే.. ఫైళ్లు ముందుకు
- శ్రుతిమించిన అధికారుల తీరు
- తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేందుకు భయపడుతున్న రైతులు
- పెద్ద మొత్తంలో ఇస్తేనే త్వరగా పనులు
- ఉన్నత అధికారుల పేర్లు చెప్పుకుని డబ్బు వసూలు చేస్తున్న సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతస్థాయి అధికారులు



వామ్మో రెవెన్యూ

- 'ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగమ్మ, సర్వేనంబర్‌కి చెందిన రెండు సెంట్ల భూమిని ఆ గ్రామానికి సంబంధించిన వీఆర్వో వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా.. విచారణ చేయకుండా అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి పట్టా చేయించారు. న్యాయం చేయాలని కోరుతూ బాధితులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. భూమిని తమకు ఇవ్వాలని కోరుతున్నారు.'
- 'మండలంలో ఓ గ్రామానికి చెందిన వీఆర్వో గ్రామ సమీపంలోని గుట్ట, శ్మశానం కలిపి 5 ఎకరాల భూమిని ఓ వ్యక్తి పేరు మీద ఆన్‌లైన్ చేశారు. ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు పెద్ద మొత్తంలోనే నగదు తీసుకున్నట్లు సమాచారం.

ఆత్మకూరు: మండలంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయి. రెవెన్యూ సిబ్బంది యథేచ్ఛగా బరితెగిస్తున్నారు. ప్రతి పనికి రేటు కట్టి సిబ్బంది, అధికారులు డబ్బు వసూలు చేస్తున్నారు. పైసలు ఇవ్వనిదే పనులు చేయడం లేదు. భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. అయితే అధికారులు మాత్రం డబ్బు మీద ఆశతో సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు. కొంత మంది రైతులు ఎవరైనా నాయకులు లేదా ప్రజా ప్రతినిధులతో రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయించుకుని సిఫార్సులతో వెళ్లినా పనులు జరగడం లేదు. పెద్ద మొత్తంలో చేయి తడిపితే ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్ణీత సమయంలోనే ఆ సమస్యలను పరిష్కరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కొంత మంది వీఆర్వోలు రైతులు ఏదైనా భూ సమస్యలపై వెళ్తే.. ఉన్నత స్థాయి అధికారుల పేర్లు చెప్పుకుని వసూళ్ల దందాకు తెరలేపుతున్నారు. అధికారుల చేయి తడకపోతే పనులు సాగవు అంటూ చెప్పుకుని రైతుల దగ్గర నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా మ్యుటేషన్ కట్టి అధికారులకు ఫైళ్లు అందించిన తరువాత వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించి రిపోర్టులు రాకుండానే వాటిని తిరస్కరిస్తున్నారు.

అందరిదీ అదే తీరు..

రెవెన్యూ సిబ్బందే కాకుండా కింద స్థాయి సిబ్బంది కూడా అదే తీరులో ఉన్నట్లు సమాచారం. ఏ రైతుకు ఏ సమస్య ఉందో ఆ రైతు ఎంత వరకు సమర్పించగలడో వీఆర్ఏల ద్వారా తెలుసుకొని వీఆర్వోలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం..

రెవెన్యూ సిబ్బంది పనులు చేయడానికి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ ఇస్తాం. అలాంటి వారు ఉంటే విచారణ చేసి ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారిపై చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మానాయక్, తహసీల్దార్

నిషేధిత ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం



దుకాణదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న షాపులపై నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి చర్యలకు ఉపక్రమించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో గురువారం నగరంలోని గాంధీబజార్, రాజు రోడ్డు, తిలక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మహవీర్, భవానీ, మహదేవ్, రేఖ, చాముండీ, కేసర్, మెట్రో, ఎస్‌వీఎస్, గంగా తదితర ప్లాస్టిక్ విక్రయ కేంద్రాలపై దాడులు చేపట్టారు. షాపుల్లో నిల్వ ఉన్న నిషేధిత ప్లాస్టిక్‌ను నగరపాలక సంస్థకు తరలించేలా కమిషనర్ బాలస్వామి చర్యలు తీసుకున్నారు. 9 టన్నుల ప్లాస్టిక్ సీజ్ చేసి, రూ.2,45,500 జరిమానా విధించారు. అలాగే ఓ షాపు యజమానిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. గతంలో కేవలం ఒక ప్రాంతంలో మాత్రమే దాడులు చేపట్టే పరిస్థితి ఉండేది. స్పెషల్ డ్రైవ్ చేపట్టి వదిలేసేవారు. ప్రస్తుతం 11 బృందాలు మూకుమ్మడిగా దాడులు చేపట్టాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించకూడదని 50కి పైగా ప్లాస్టిక్ వ్యాపారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. కానీ వారిలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ప్లాస్టిక్ విక్రయ కేంద్రాలపై దాడులు చేపట్టామన్నారు. ఇది నిరంతరంగా జరుగుతుందన్నారు. మున్ముందు దాడులను యథావిధిగా కొనసాగిస్తామన్నారు. రెండోసారి ప్లాస్టిక్ విక్రయిస్తూ పట్టుబడితే రూ.50 వేల జరిమానా, కోర్టులో ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. నగర ప్రజలు సైతం నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. రానున్న రోజుల్లో హోటళ్లు, షాప్‌లపై దాడులు చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ప్లాస్టిక్ ట్రేడర్స్‌పై కేసు నమోదు

అనంతపురం: ప్లాస్టిక్ నియంత్రణకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తిలక్ రోడ్డులోని కనకదుర్గ ప్లాస్టిక్ ట్రేడర్స్ నిర్వాహకులు మున్సిపల్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఏఈ రాజశేఖర్ రెడ్డిని బెదిరించారు. విధులకు ఆటంకం కలిగించే రీతిలో వ్యవహరించిన కనకదుర్గ ట్రేడర్స్‌పై కేసు నమోదు చేయాలని ఏఈ రాజశేఖర్ రెడ్డి అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కనకదుర్గ ట్రేడర్స్ యజమానులు పేరు సైతం చెప్పడానికి నిరాకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు.

వీధి బాలల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్



వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

అనంతపురం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు సహా ఇతర అంశాలను ఆధార్‌తో ముడిపెట్టింది. దీంతో ఆధార్ చాలా కీలకంగా మారింది. ఈ క్రమంలో ఆధార్ కార్డులు లేని వీధి బాలలు, అనాథ పిల్లలను గుర్తించి ఆధార్ నమోదు చేయించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయాలు, కార్మిక, ఐసీడీఎస్, ఐసీపీఎస్, చైల్డ్ లైన్ సహా ఇతర శాఖల అధికారులు బృందాలుగా విడిపోయి, ఆధార్ లేని పిల్లలను గుర్తించేందుకు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురంలోని వివిధ ప్రాంతాలతో పాటు టీవీ టవర్, లెనిన్ నగర్, నందమూరి నగర్ తదితర ప్రాంతాల్లోనూ గురువారం స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ఒక్క రోజే ఆధార్ కార్డుల్లేని 10 మంది పిల్లలను గుర్తించామని ఐసీపీఎస్ సోషల్ వర్కర్ తోపుల వెంకట్‌కుమార్, కౌన్సెలర్ సంధ్య తెలిపారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ వారి సహకారంతో సమస్యను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి, పైన పేర్కొన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయించనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్: అందరితో పోటీ పడుతూ గాండ్ల విద్యార్థులు ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ఉన్నతంగా రాణించడం అభినందనీయమని వక్తలు అన్నారు. గురువారం స్థానిక శ్రీనివాస నగర్‌లోని శ్రీబాలాజీ కల్యాణ మండపంలో ఈ ఏడాది ఇంటర్, పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 41 మంది విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పెరవలి రాము, రాష్ట్ర నాయకులు చిత్రచేయుడు విశాలాక్షి, విద్యా కమిటీ కన్వీనర్ పార్లపల్లి రవి మాట్లాడారు. గాండ్ల సామాజిక వర్గం ఒకప్పుడు వెనకబాటుకు గురైనా ఈతరం విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని సునాయసంగా జయిస్తున్నారన్నారు. రాజకీయ, ఆర్థిక, సేవా రంగాల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. పోటీతత్వాన్ని కొనసాగిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహుడు, ప్రధాన కార్యదర్శి గవ్వల రమేష్, విజయలక్ష్మి, వెంకటరత్నమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రబోసు, ప్రధాన కార్యదర్శి వెంకటరాముడు, లలితమ్మ, రఘురాం, లక్ష్మీనారాయణ, నరసయ్య, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



రాజేశ్వరి (ఫైల్)

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రాజేశ్వరి (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. గత సోమవారం ఇంట్లో అక్క, బావ గొడవ పడుతుండటంతో రాజేశ్వరి సర్దిచెప్పడానికి ప్రయత్నించింది. దీనిపై వారు అసహనం వ్యక్తం చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురై మరుగుదొడ్డిలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. నొప్పి తట్టుకోలేక గట్టిగా అరవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని భావించిన వైద్యులు బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఇంటికి వచ్చిన అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహానాడుకు బస్సులు..
ప్రయాణికుల బేజారు



బస్సులో సీటు కోసం పోటీపడుతున్న దృశ్యం

కడపలో టీడీపీ తలపెట్టిన మహానాడు కార్యక్రమానికి బస్సులు పంపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల కొద్దీ నిరీక్షించినా బస్సులు రాకపోవడంతో రోగులు, వృద్ధులు, మహిళలు అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాలకు బస్సులను ఉపయోగించడంపై ప్రజలు మండిపడ్డారు. అరకొర బస్సులు జనం రద్దీతో కిక్కిరిసిపోయాయి. సీటు దొరకకపోవడంతో వృద్ధులు, రోగులు నిలబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మహానాడుకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులను ఉపయోగించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు, చిత్రంలో కమిషనర్ బాలస్వామి



రాప్తాడులో ర్యాలీ చేస్తున్న అధికారులు

అనంతపురం కార్పొరేషన్: ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలి. రోజూ ఓ అరగంట పాటు యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీర ధారుఢ్యం పెంపొందుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ ఎదుట యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, డ్వామా పీడీ సలీంబాషా, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు. యోగా గురువులు కృష్ణవేణి, దివాకర్, తదితరులు వివిధ ఆసనాలతో పాటు ప్రాణాయామం, తదితర యోగాసనాలను వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పని ఒత్తిడితో అందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. మానసిక సమస్యలతో వివిధ రకాల రుగ్మతలతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈలు షాకీర్, నరసింహ, డీఈలు సుధారాణి, సుభాష్ చంద్రబోస్, సీసీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై శిక్షణ

రాప్తాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు. రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అధికారులు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. యోగా సాధనతో పలు రకాల మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరాలంటే ఒక్క యోగాతో సాధ్యమవుతుందన్నారు. యోగ శిక్షణ కార్యక్రమం నెల రోజుల పాటు ఉంటుందని.. ,ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, సినియర్ అసిస్టెంట్ అచ్చుతానంద బాబు, పీఈటీలు కేశవమూర్తి, నారాయణ రెడ్డి, సర్పంచు సాకే తిరుపాల్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో యోగాసనాలు చేయిస్తున్న సీహెచ్‌ఓ ప్రీతి

యోగాతో మానసిక ప్రశాంతత

ఆత్మకూరు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సీహెచ్‌ఓ ప్రీతి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాలలో విద్యార్థులతో యోగా చేయించారు. యోగ శిక్షణ కార్యక్రమం నెల రోజుల పాటు ఉంటుందని.. ,ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సరస్వతీ జలాలతో బాబాకు అభిషేకం

అనంతపురం కల్చరల్: సరస్వతీ నది పవిత్ర జలాలతో సాయినాథుడికి అభిషేకం జరిగింది. తపోవనంలోని శివశక్తి బాబా మందిరంలో గురువారం సాయిట్రస్టు వారు తెలంగాణలోని కాళేశ్వరం నుంచి తెచ్చిన జలాలతో సామూహిక జలాభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందు విష్ణు సహస్ర నామ పారాయణం, మహాశివుడికి రుద్రాభిషేకం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. అలాగే సాయంత్రం పవిత్ర వారణాసి జలాలతో శివుడు, అమ్మవారికి రుద్రాభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం సరస్వతీ నదీ జలాలను భక్తులకు అందజేశారు.

'డీఎంహెచ్‌ఓపై ఆరోపణలు తగవు'

అనంతపురం మెడికల్: శ్రీ సత్యసాయి జిల్లా డీఎంహెచ్‌ఓపై ఆరోపణలు చేయడం తగదని ఏపీ ప్రభుత్వ స్టాఫ్‌నర్సుల సంఘం అధ్యక్షురాలు ఆర్‌బీ పద్మ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎంహెచ్‌ఓ ముక్కుసూటిగా వెళ్తున్నారని.. తమ సమస్యలను తీసుకెళితే తక్షణం స్పందించారని తెలిపారు.

శేష జీవితంలోనూ సేవలందించాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న జిల్లా జడ్జి భీమరావు తదితరులు

అనంతపురం: శేష జీవితంలోనూ తమ అమూల్యమైన సేవలను మాతృశాఖకు అందించాలని జిల్లా జడ్జి భీమరావు అన్నారు. గురువారం రాత్రి జిల్లా కోర్టులో సీఏఓ జీఆర్ మురళీధర్, ప్రాసెస్ సర్వర్ గుంటి రామమోహన్‌కు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమరావుతో పాటూ జిల్లా అడిషనల్ జడ్జి సత్యవాణి, ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జి సాధుబాబు, ఫ్యామిలీ కోర్టు జడ్జి హరిత తదితరులు ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగుల సేవాభావం గురించి మాట్లాడారు. అదేవిధంగా ఇరవై ఏళ్ల కిందట న్యాయశాఖలో ఉద్యోగ విరమణ చేసిన గుంటి నరసింహమూర్తి చనిపోయే వరకు నిరంతరం న్యాయశాఖ ఉద్యోగులకు అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బాగా పని తెలిసిన వారు క్రమంగా ఉద్యోగ విరమణ చేస్తుంటే వారి అనుభవాన్ని కొత్త తరాలకు పంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. జ్ఞానాన్ని పంచడం కన్నా ఎప్పుడు, ఎక్కడ మన జ్ఞానాన్ని వినియోగించుకోవాలన్న దానిపై మన వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుందని దానిని ఉద్యోగులందరూ పాటించాలన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

విద్యార్థి మిత్ర కిట్ల రవాణా నిధుల మంజూరు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వం సరఫరా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను మండల స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు రవాణా చేసేందుకు నిధులు మంజూరైనట్లు సమగ్రశిక్ష ఏపీసీ టి.శైలజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంఈఓ–2ల ఖాతాలకు నిధులు జమ చేసినట్లు వెల్లడించారు. అలాగే మండలస్థాయిలో పని చేస్తున్న బృంద సభ్యులకు రవాణా భత్యం ఖర్చులు, ప్యాకింగ్ ఖర్చులకు సంబంధించిన నిధులు కూడా జమ చేసినట్లు పేర్కొన్నారు. నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని ఎంఈఓలకు సూచించారు.

ఆర్‌ఎంపీలూ పరిధి దాటొద్దు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: గర్భిణులకు చికిత్సలు అందజేసే క్రమంలో ఆర్‌ఎంపీలు పరిధులు దాటరాదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గర్భిణులను ఆర్‌ఎంపీలు ఎలాంటి పరిస్థితుల్లోనూ స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేయరాదన్నారు. స్కాన్ సెంటర్ల నిర్వాహకులు సైతం ఆర్‌ఎంపీలకు కమీషన్ల ఎర చూపరాదన్నారు. లింగ నిర్ధారణ చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయన్న విషయాన్ని మరువకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

వరికి మద్దతు ధర పెంచాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: ఖరీఫ్‌కు సంబంధించి వరికి మద్దతు ధర క్వింటాకు రూ.69 పెంచి భారీగా పెంచామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున విమర్శించారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరికి కేంద్రం మద్దతు ధర పెంపు స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా లేదన్నారు. 2010–11 ఆర్థిక సంవత్సరం నుంచి పంటలకు భారీగా మద్దతు ధరలు పెంచినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మోదీ హయాంలో మద్దతు ధరలు లభించక... పెట్టుబడులు రాక అప్పులపాలై రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమవుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వరిధాన్యం ధర క్వింటాకు రూ.2,369కి చేరుతుందని, అయితే స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా క్వింటా ధర కనీసం రూ.3 వేలకు పైగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకునేందుకు ఒక పర్యాయం రుణమాఫీ ప్రకటించాలనే డిమాండ్‌తో జూలై 9న గ్రామీణ బంద్ నిర్వహించనున్నట్లు మల్లికార్జున పేర్కొన్నారు. వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు